క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి



ఆహార పదార్థాల తయారీని పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి నారాయణ తదితరులు

కె.గంగవరం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా ఉండేలా నిర్వాహకులు చూడాలని జిల్లా ఎడ్యుకేషన్ ఇంక్లూజివ్ సెక్టోరియల్ అధికారి ఎంవీఎస్ నారాయణ సూచించారు. కె.గంగవరం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, శుభ్రమైన వాతావరణంలో విద్యార్థులకు వండి వడ్డించాలని విజ్ఞప్తి చేశారు. నూటికి నూరు శాతం మధ్యాహ్నం పాఠశాలలోనే విద్యార్థులు భోజనం చేసేలా అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలసి ఆయన భోజనం చేశారు. మిడ్ డే మీల్ కోఆర్డినేటర్ వి.శ్రీధర్, హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు జీవీఎస్ సుబ్రహ్మణ్యం, పితాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రామచంద్రపురం: పీడీఎస్‌యూ విద్యార్థి, జైభీమ్ సైనిక్ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి, దంత వైద్య శిబిరాలను ఏర్పాటు నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, జైభీమ్ సైనిక్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ రాజు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ నగర్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరానికి ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, కపిలేశ్వరపురం, ద్రాక్షారామ హ్యాపీ డెంటల్ హాస్పిటల్స్ వైద్య సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో కంటి, దంత పరీక్షలు, సాధారణ దంత చికిత్సలు ఉచితంగా అందిస్తారన్నారు.

ఉచిత గణిత ఒలింపియాడ్ తరగతులు

రామచంద్రపురం: గణిత సేవా సంస్థ రామానుజన్ గణిత అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు గణిత ఒలింపియాడ్ తరగతులు నిర్వహిస్తామని రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 6, 7, 8 తరగతుల విద్యార్థులు జూనియర్స్‌గా, 9, 10 ఇంటర్ విద్యార్థులు సీనియర్స్‌గా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా తరగతులకు ఒలింపియాడ్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన బుక్స్, మెటీరియల్, ఓల్డ్ పేపర్స్ తదితరాలు రామచంద్రపురంలోని గణితశాస్త్రం గ్రంథాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. దీనికి సంబంధించిన అవగాహన సదస్సును ఈ నెల 22న ఉదయం 9 గంటలకు రామానుజన్ గణిత అకాడమీలో నిర్వహిస్తామన్నారు. దీనికి విద్యార్థుల తల్లిదండ్రులలో ఒకరు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన తెలిపారు.

రేపు మండల సమావేశం

కపిలేశ్వరపురం: స్థానిక మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి గ్రామోత్సవం

రాయవరం: పసలపూడి శివారు గొల్లల తూము వద్ద వేంచేసి ఉన్న గంగమ్మ తల్లి అమ్మవారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటా నిర్వహించే ఉత్సవంలో భాగంగా అమ్మవారి ప్రతిమను శిరస్సున ధరించి ఊరేగించారు. అమ్మవారికి అడుగడుగునా భక్తులు నీరాజనాలు పలికారు. మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దుకాణాల్లో తనిఖీలు



రాయవరంలో తనిఖీ చేస్తున్న అధికారులు

రాయవరం: గ్రామంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా దుకాణాల్లో విక్రయిస్తున్న నిత్యావసర వస్తువులను పరిశీలించినట్టు తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ శంకర విశ్వేశ్వరరావు తెలిపారు. తనిఖీల్లో టెక్నికల్ లీగల్ మెట్రాలజీ అధికారి ఎం.వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట గొల్లపుంత కాలనీ రోడ్‌లో బుధవారం రెండు మోటారుసైకిళ్లు ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. ఆ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక టిడ్కో అపార్ట్‌మెంట్లలో నివాసముంటున్న షేక్ బడే మియా బంధువులు షేక్ బాబులు, షేక్ ఇమామ్ షరీఫ్‌లు మోటారుసైకిల్‌పై పట్టణంలోకి వస్తుండగా వారి ముందు వెళ్తున్న మరో మోటారుసైకిలిస్టు అకస్మాత్తుగా బ్రేక్‌వేశాడు. దీంతో బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో షేక్ బాబులు తలకు తీవ్రగాయాలు కావడంతో తొలుత పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి, తర్వాత రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పాలిథిన్... పరేషాన్

- ఈ వ్యర్థాలతో అనేక అనర్థాలు
- భారీగా పెరిగిపోతున్న వినియోగం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



సత్యవాడ గ్రామ రహదారిలో రోడ్డు పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు

కె.గంగవరం: బయటకు వెళ్తే, కాళ్లు కడుక్కొని ఇంట్లోకి వచ్చే మనం పాలిథిన్ భూతాన్ని మాత్రం స్వయంగా కొనుక్కుని మరీ ఇంట్లోకి తెచ్చేస్తున్నాం. చిన్నపాటి అశ్రద్ధ కారణంగా రోజూ పదుల సంఖ్యలో క్యారీ బ్యాగ్‌లను వాడుతూ అటు పర్యావరణానికి, ఇటు మానవ ఆరోగ్యానికి ముప్పు తెస్తున్నాం. వస్త్రంతో తయారు చేసిన చేతి సంచిని వినియోగిస్తే ఒక కుటుంబం రోజుకు పదికి పైగా ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకాన్ని తగ్గించవచ్చు. కానీ ఆ దిశగా ఎవరూ ఆలోచించడం లేదు. దీంతో విచ్చలవిడిగా పాలిథిన్ వ్యర్థాలు పేరుకుపోయి, ఇవన్నీ గ్రామాల శివార్లలో డంపింగ్ యార్డులకు చేరుతున్నాయి. కొండలా పేరుకుపోతున్న వీటిని వదిలించే క్రమంలో నిప్పు పెడుతున్నారు. దీంతో తీవ్రమైన వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. ఇంకా వాతావరణం వేడెక్కి కాలుష్యం మరింత పెరిగి చివరికి మానవాళికి ముప్పు తెచ్చుకుంటున్నాం. పాలిథిన్ నిషేధం అమలుపై యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధానంగా ప్రతి గ్రామంలో ఊరి శివార్లలో పాటు పలు ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. బాగా పెరిగిన వాటికి నిప్పంటిస్తున్నారు. కూరగాయలు, టిఫిన్ సెంటర్లు, ఇతర ఆహార పదార్థాలు ఇళ్లకు తెచ్చుకోవడానికి, పాల ప్యాకెట్లు, డిస్పోజబుల్ పేట్లు ఇలా ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రతి అవసరంలోనూ ప్లాస్టిక్ వస్తువులనే వినియోగిస్తున్నారు. ఇదే ఇబ్బందిగా పరిణమిస్తోంది.

రోజుకు 30 టన్నుల చెత్త

రామచంద్రపురం నియోకజవర్గంలోని కె.గంగవరం, రామచంద్రపురం పట్టణం, రూరల్, కాజులూరులో ప్రతి రోజూ సుమారు 30 టన్నులకు పైగానే చెత్త సేకరిస్తున్నట్లు ఒక అంచనా. ఇందులో సుమారు 3 నుంచి 5 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయని అధికారులే చెబుతున్నారు. తడి, పొడి చెత్త వేరు చేసి సేకరించి, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేయాలనే విధానం ఎక్కడా అమలు కావడం లేదు. ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి ఉపయోగించుకోవాలన్న ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. ఇదిలాఉంటే బహిరంగంగా పాలిథిన్ సంచులను విక్రయిస్తున్నా అడిగేవారు ఉండడం లేదు. అలాగే అధికారుల దాడులు నామమాత్రంగా ఉండడంతో కొందరు వ్యాపారుల ఇష్టారాజ్యం అయ్యింది.

నిప్పు పెడితే ప్రమాదం

ప్లాస్టిక్‌ను కాల్చితే ప్రమాదమని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ ప్రక్రియతో విపరీతమైన వాయు కాలుష్యం ఏర్పడుతోంది. శ్వాస సంబంధ వ్యాధులతో ఇబ్బందులు పడేవారి సంఖ్య పెరగడానికి ఇది ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంపై ఎవరికి వారు అవగాహన పెంచుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టిక్‌ను కాల్చకుండా ప్రభుత్వ యంత్రాంగం కూడా చర్యలు చేపట్టాలని ఇందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు చొరవ చూపాలని కోరుతున్నారు.

వినియోగం.. ప్రమాదం



ప్లాస్టిక్ వినియోగంతో ప్రధానంగా క్యాన్సర్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. దీనివల్ల గుండె సంబంధిత జబ్బులు కూడా వస్తాయి. ప్లాస్టిక్ సంచిలో వేడిగా ఉన్న ఆహారాన్ని పార్సిల్ చేయడం వల్ల దానిలో ఉన్న రసాయనాలు కరిగిపోతాయి. దానిని తినడంతో వివిధ ఆరోగ్య సమస్యలు వస్తాయి. ప్లాస్టిక్ భూమిలో కరగడానికి చాలా ఏళ్లు పడుతుంది. దీంతో పండించే పంటలు నాశనం కావడంతో పాటు ప్రజలు కూడా రోగాల పాలవుతారు.

– విష్ణువర్ధన్, పీహెచ్‌సీ వైద్యుడు, పామర్రు

వాడకం తగ్గించాలి



గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకం పెరిగింది. పూర్వకాలం నుంచి ఆహార పదార్థాలను ఇంటికి తీసుకు రావాలంటే ఇంట్లో ఉన్న గిన్నెలను మాత్రమే వాడేవారు. కానీ మారుతున్న కాలం ప్రకారం ప్లాస్టిక్ సంచును వినియోగిస్తున్నారు. దానివల్ల ప్రజలు రోగాల పాలవడమే కాకుండా ఎంతో విలువైన భూమి కూడా కలుషితం అవుతుంది. ప్రభుత్వాలు ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి.

– బత్తుల విజయకుమారి, మాజీ సర్పంచ్, కుందూరు

కళాశాల స్థలంలో మట్టి అక్రమ తవ్వకాలు

పోలీసులకు ఫిర్యాదు చేస్తానంటున్న ప్రిన్సిపాల్



కళాశాల భవనం వెనుకవైపు అక్రమంగా మట్టిని తవ్విన భాగం

రాయవరం: స్థానిక ప్రభుత్వ కళాశాలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నారు. గ్రామానికి సుమారుగా 2 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో తరగతులను తరలించడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం నిరుపయోగంగా మారింది. కళాశాల భవనం, అక్కడి స్థలాలపై అజమాయిషీ కొరవడింది. ఇంకేముంది ఇదే అక్రమార్కుల పాలిట వరంగా మారింది. ఎవరూ పట్టించుకోరనుకున్నారో.. ఏమో కళాశాల వెనుక భాగాన ఉన్న స్థలంలో మట్టిని బట్టీకి తరలించుకుపోయారు. రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వపు భవనం ఆనుకుని ఉన్న స్థలంలో మట్టిని తరలించుకుపోవడం, చెట్లను కొట్టివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కళాశాలను ఆనుకుని ఉన్న స్థలాన్ని ఒక బట్టీ యజమాయని పచ్చగడ్డి పెంచుకోవడానికి లీజుకు తీసుకున్నట్లుగా సమాచారం. అయితే ఈ లీసు అధికారికమా? అనధికారికమా? అన్న విషయం తేలాల్సి ఉంది. ఎవరి అనుమతితో ఇంత ధైర్యంగా మట్టిని తరలించుకు పోయారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రాత్రి సమయంలో జేసీబీల సహాయంతో మట్టిని తవ్వి ట్రాక్టర్లపై బట్టీకి తరలించుకు పోవడం, చెట్లను నరికేయడంపై స్థానిక నేత వుండవిల్లి రాంబాబు ఇంటర్మీడియెట్ జిల్లా అధికారికి బుధవారం ఫిర్యాదు చేశారు. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామారావును వివరణ కోరగా, కళాశాల స్థలాన్ని ఎవరికీ లీజుకు ఇవ్వలేదని తెలిపారు. కళాశాల స్థలంలోని మట్టిని అక్రమంగా తరలించుకుపోయిన విషయం తన దృష్టికి వచ్చిందని దీనిపై గురువారం రాయవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

ఎన్నికల దరఖాస్తుల పరిశీలన శాస్త్రీయంగా ఉండాలి



మండపేటలో రాజకీయ పార్టీలతో చర్చిస్తున్న ఎన్నికల సహాయాధికారి తేజేశ్వరరావు

కపిలేశ్వరపురం (మండపేట): ఎన్నికలకు సంబంధించిన దరఖాస్తులను శాస్త్రీయంగా పరిశీలించాలని మండపేట నియోజకవర్గం ఎన్నికల సహాయ అధికారి పి.తేజేశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మండపేట నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులు, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఫారం 6,7,8 దరఖాస్తుల స్వీకరణ, పరిశీలనలపై చర్చించారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ ప్రతినిధులు యరమాటి వెంకన్నబాబు, మేడపాటి రవీంద్ర రెడ్డి, ఎ.సత్యనారాయణ, పందిరి వీర్రాజు హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ ప్రతినిధి యరమాటి వెంకన్నబాబు మాట్లాడుతూ సమావేశాలకు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు హాజరుకావడం ద్వారా చర్చలు ప్రయోజనకరంగా సాగుతాయని, ఆయన హాజరయ్యేలా చూడాలన్నారు. గొల్లపుంత కాలనీలో 93, 94 పోలింగ్ బూత్‌లకు చెందిన వారి ఓట్లు వేరే పోలింగ్ బూత్‌లోకు మళ్లిన విషయాన్ని ప్రస్తావించారు. టీడీపీ ప్రతినిధి మేడపాటి రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ ఒక్కో బూత్‌కు 1000 ఓట్లు లోపు మాత్రమే ఉండేలా చూడాలని ప్రతిపాదించారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పీపీ మెహర్ బాబా, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస రావు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మించాలంటూ ఆందోళన



కేశవరం పాఠశాల దీక్షా శిబిరం వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, శ్రీవాణి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం డి.కేశవరంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీని వెంటనే నిర్మించాలంటూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.రాజా, కె.జ్యోతి సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. అదే డిమాండ్‌పై గ్రామానికి చెందిన మహిళ వల్లూరి శ్రీవాణి చేస్తోన్న రిలే నిరాహార దీక్ష బుధవారంతో 62వ రోజుకు చేరుకుంది. ఆమె నిరసన దీక్షా శిబిరం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు సమస్య సాధన కోసం ఆందోళన చేశారు. నాయకులు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ ప్రహరీ నిర్మించకపోవడం శోచనీయమన్నారు. సెలవు దినాల్లో నిర్మాణం పూర్తి చేసి ఉంటే పాఠశాల నిర్వహణకు ఉపయుక్తంగా ఉండేదని అన్నారు. తాను 62 రోజులుగా నిరసన దీక్షా చేస్తున్నప్పటికీ గోడ నిర్మాణం చేపట్టకపోవడం సరికాదని శ్రీవాణి అన్నారు. వై.భాస్కర్, జోసఫ్, కనక, లహరి, సౌమ్య కార్తీక్ పాల్గొన్నారు.

ప్రతిభతో మెరుగైన జీవితం



మండపేటలో విద్యార్థులను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): పాఠశాల విద్యలో ప్రతిభను కనబర్చడం ద్వారా మెరుగైన జీవితాన్ని గడపవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ టెస్ట్ (ఎన్ఎంఎంఎస్)లో ప్రతిభ కనబర్చిన పట్టణంలోని ఎస్ఎస్‌వీవీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులను చైర్‌పర్సన్ అభినందించారు. ఎంపికై న విద్యార్థులు పి.సృజన్ కుమార్, కె.దివ్య ధనలక్ష్మి, జి.సోమవినయ్ తాతాజీ, జె.లక్ష్మీప్రసన్న సాయి జ్యోతిలను చైర్‌పర్సన్ దుర్గారాణి తన చాంబర్‌లో సత్కరించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తన క్యాంపు కార్యాలయంలో విద్యార్థులను శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎస్ రామచంద్రరావు, సీహెచ్‌వీ సోమిరెడ్డి, పాఠశాల హెచ్ఎం ఎం.వెంకటేశ్వరరావు, కె.గోపాలకృష్ణా రెడ్డి, ఎం.శ్రీనివాస్, పి.రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ బోసు, ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం 2వ వార్డులో చేపట్టిన నూతన ఆసుపత్రి నిర్మాణ పనులను ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోసు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రెడ్డి రాజుబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి పరిశీలించారు. గైనకాలజీ విభాగం నిర్మాణ పనుల అంచనాలపై ఏపీఎంఎస్ఐడీ అధికారులతో చర్చించారు. ఎంపీ బోసు, ఎమ్మెల్యే వేగుళ్ల పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, పట్టణంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కాజులూరు: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కాకినాడ ఏపీ ఈపీడీసీఎల్ డీఈ ఎన్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్ స్టేషన్ ఏఈ వీరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లో మరమ్మతులు, విద్యుత్ లైన్లపై ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ కాజులూరు, తిప్పరాజుపాలెం, ఐయితపూడి, శీల, శీలలంక, ఒంటితాడి పల్లిపాలెం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. గృహావసర వినియోగదారులతోపాటు ఆక్వా, ఇండస్ట్రీయల్ ఫీడర్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలివేస్తామన్నారు.

వరద.. వణికిస్తున్న ఆపద

- కలవరపెడుతున్న ఏటిగట్లు
- రక్షణ పనులు అత్యవసరం



పాశర్లపూడిబాడవలో బలహీనంగా ఉన్న ఏటిగట్టు

మామిడికుదురు: వరదల సీజన్ వచ్చేస్తుంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో గోదావరి నదీ ఎగువ ప్రాంతాల్లో ఇప్పటికే పలుచోట్ల భారీ వానలు పడుతున్నాయి. దీంతో తీర గ్రామాల ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కరకట్టలు బలహీనంగా మారడంతో తీర గ్రామాలతో పాటు ఏటిగట్టు ఎగువ ప్రాంతాల ప్రజలు సైతం ఆందోళన చెందుతురు. పి.గన్నవరం మండలం నాగుల్లంక నుంచి గోగన్నమఠం వరకూ వైనతేయ కుడి కరకట్ట పలుచోట్ల బలహీనంగా ఉంది. గోదావరికి భారీ వరదలు వచ్చిన సందర్భంలో బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో అలజడి నెలకొంటోంది. వరద నీరు ఏటిగట్టు ఎగువ ప్రాంతాలకు లీకవడంతో పాటు గట్టు పొర్లి నీరు ఏటిగట్టు ఎగువ ప్రాంతాల్లోకి చొచ్చుకు వచ్చే పరిస్థితి ఏర్పడుతోంది. ఇటువంటి సమయాల్లో ఇసుక బస్తాలతో తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టడం తప్ప చాలాకాలం నుంచి పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది అయినా గోదావరి వరదల సమయంలో ఆ పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

ఏటిగట్టు.. కుంగినట్టు

పాశర్లపూడిలంక, పాశర్లపూడిబాడవ అదే గ్రామంలోని తుమ్మావారి ఏరియా, పెదపట్నం అగ్రహారం కనకదుర్గ ఆలయం, మానేపల్లి గ్రామంలో ఏటిగట్టు బలహీనంగా ఉంది. 2022 గోదావరి వరదల సమయంలో పైన పేర్కొన్న ప్రాంతాల్లో ఏటిగట్టుపై నుంచి వరద నీరు పొర్లడంతో స్థానికులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. అక్కడ అప్పట్లో తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టడం తప్ప పక్కాగా ఇంత వరకూ ఏవిధమైన పటిష్ట పనులు చేయలేదు. ఈ మూడు నెలలు వరదల సీజన్ కావడంతో స్థానికుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటి నుంచి బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏటా ఆందోళనే



బలహీనంగా ఉన్న ఏటిగట్ల వద్ద ఏటా ఆందోళనకర పరిస్థితులు నెలకొంటున్నాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో కరకట్టలను బలోపేతం చేశారు. మళ్లీ అప్పటి నుంచి ఇప్పటి వరకూ వాటి ఆలనా పాలనా పట్టించుకునేవారు లేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తీర గ్రామాల ప్రజలతో పాటు ఏటిగట్టు ఎగువ ప్రాంతాల వారు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలి.

– కట్టా రామకృష్ణ, పాశర్లపూడి

బలహీనంగా ఏటిగట్టు



పాశర్లపూడిలో ఏటిగట్టు చాలా బలహీనంగా ఉంది. ఇక్కడ చాలా పల్లంగా ఉండడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గోదావరి వరదల సమయంలో ఏటిగట్టు వద్ద కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. 2022లో ఇసుక బస్తాలు వేసి ఏటిగట్టు వద్ద తాత్కాలిక చర్యలు చేపట్టడం వల్ల ప్రమాదం తప్పింది. లేదంటే ఇక్కడ గండి పడేది. ఈ పరిస్థితి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

– యర్రంశెట్టి గణేష్, పాశర్లపూడి

సమస్య లేకుండా చర్యలు

2022 గోదావరి వరదల్లో ఏటిగట్టు పొర్లి ప్రమాదకరంగా మారిన ప్రాంతాల్లో ఎర్త్ వర్క్ చేపట్టేందుకు రూ.96 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. మానేపల్లి, పాశర్లపూడి, పాశర్లపూడి లంక ప్రాంతాల్లో ఏటిగట్టు రక్షణ పనులు చేపడతాం. ఈ పనుల నిర్వహణకు టెండర్ ఓకే అయ్యింది. త్వరలో పనులు మొదలు పెడతాం. వరదల నాటికి ఏవిధమైన సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం.

– టీవీఎల్ఎస్ మూర్తి, హెడ్‌వర్క్స్ ఏఈ, రాజోలు

తొలకరి సాగుకు చొరవ చూపాలి



చేదువాడలో రైతులకు సూచనలు ఇస్తున్న మండల వ్యవసాయాధికారి అశోక్

కాజులూరు: తొలకరి సాగుకు రైతులు చొరవ చూపాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మండలంలోని కాజులూరు, చేదువాడ, బందనపూడి తదితర గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చేదువాడలో అశోక్ మాట్లాడుతూ తూర్పు డెల్టా కాలువకు ఇరిగేషన్ అధికారులు సాగునీరు విడుదల చేశారన్నారు. పంట కాలువల ద్వారా పొలాలకు సాగునీరు చేరుతుందని, రైతులు పంట దమ్ములకు సిద్ధం కావాలన్నారు. జూన్ నెలాఖరు నాటికి నారుమడులు వేసుకుని జూలై రెండో వారానికి నాట్లు పూర్తి చేస్తే అక్టోబర్ నెలాఖరుకు పంట చేతికొస్తుందన్నారు. దీనివల్ల పంట ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా ఉంటుందన్నారు. తద్వారా నవంబర్, డిసెంబర్ నెలల్లో దాళ్వా సాగు చేపట్టి మర్చి, ఏప్రిల్‌లో అంతర పంటలైన పెసర, మినుము మూడో పంటగా సాగు చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. రైతులు సాధ్యమైనంత త్వరగా తొలకరి పనులు ప్రారంభించాలని అన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

కాజులూరు: దేశ చరిత్రలో ప్రధాని మోదీ పాలన ఒక సువర్ణ అధ్యాయమని బీజేపీ జిల్లా కో కన్వీనర్ సలాది వీరవెంకట సత్యనారాయణ (వీరబాబు) అన్నారు. బుధవారం తర్లంపూడి, టి.మామిడాడ తదితర గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు పర్యటించి మోదీ సుపరిపాలన, అమృతకాలం కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ ఉచిత గ్యాస్ కనెక్షన్లు, కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ప్రజలకు ఆసరా కల్పించారన్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి రామకృష్ణ, నాయకుడు నరాల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఏఈగా సుందరసింగ్



కోటిపల్లిలో కాటన్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఏఈ సుందరసింగ్

కె.గంగవరం: కోటిపల్లి సెక్షన్ ఇరిగేషన్ ఏఈగా దుర్గం సాయి సుందరసింగ్ నియమితులయ్యారు. ఇక్కడ ఇరిగేషన్ ఏఈగా విధులు నిర్వహించిన బి.సుబ్రహ్మణ్యం ద్రాక్షారామ డ్రైనేజీ సెక్షన్‌కు బదిలీ అయ్యారు. తాటిపాక సెక్షన్ ఇరిగేషన్ ఏఈగా పనిచేస్తున్న సుందరసింగ్ బదిలీపై కోటిపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన ఏఈకి స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. అనంతరం కోటిపల్లి ఇరిగేషన్ కార్యాలయం వద్ద కాటన్ విగ్రహానికి సుందరసింగ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటిపల్లి సెక్షన్ పరిధిలోని పంట కాలువలకు సక్రమంగా నీరు పారేలా చర్యలు తీసుకుంటానని, ప్రతి ఎకరానికి సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో ఇటీవల ఆప్తులను కోల్పోయి బాధలో ఉన్న పలువురుని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. 30 వార్డులో వేమగిరి లక్ష్మి, 13వ వార్డులో గొట్టుపల్లి లత, పాలచర్ల కిట్టయ్య, 14వ వార్డులో దొడ్డిపట్ల సత్యనారాయణ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

అర్తమూరు-అనపర్తి బీటీ రహదారికి శంకుస్థాపన

కపిలేశ్వరపురం: అర్తమూరు-అనపర్తి బీటీ రహదారి నిర్మాణ పనులకు బుధవారం అనపర్తిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి శంకుస్థాపన చేశారు. రూ.1.60 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రహదారితో మండపేట, అనపర్తి గ్రామాల మధ్య రహదారి మెరుగుపడనుందని ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నాయకులు అన్నారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు. మండపేట ఏఎంసీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, మాజీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పాలక మండలి సభ్యుడు పడాల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

శేషారావుకు చైర్‌పర్సన్ పలకరింపు



ద్వారపూడిలో శేషారావును పలకరిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, రాజుబాబు

కపిలేశ్వరపురం (మండపేట): ఇటీవల అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ద్వారపూడి గ్రామ ఉప సర్పంచ్ తులా శేషారావును మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కోఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు పలకరించారు. ద్వారపూడిలోని శేషారావు నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శేషారావును పలకరించినవారిలో మండపేట మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ అడబాల బాబ్జి, పార్టీ నాయకులు సాధనాల శివ భగవాన్, పోలినాటి సత్యనారాయణ, నామాల జానకిరామ్ ఉన్నారు.